ప్రజాశక్తి
గురువారం 15 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం



16న కురుపాంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న కురుపాం జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమోలో ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని చెప్పారు. జాబ్‌మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న యువత వివరాలను www.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6303493720, 8978878557 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంజినీరింగ్, నీట్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, బొబ్బిలి, బాడంగి

ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్, ఇంజినీరింగ్ కోర్సు ప్రవేశాలకు నిర్వహించిన ఇఎపిసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. నీట్‌లో జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి విద్యలనగరం పేరుకు సార్థకత చేకూర్చారు. వైద్యరంగంలో రాణించి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

నీట్



వంగపండు సంతోషిణి
592వ ర్యాంకు

బాడంగి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన వంగపండు సంతోషిణి ఒపెన్ కేటగిరిలో నీట్‌లో ఆలిండియా 592వ ర్యాంకు, ఓబిసి కేటగిరిలో 134వ ర్యాంకు సాదించింది. 720 మార్కులకు 693 మార్కులు సాదించి సంతోషిణి సత్తా చాటింది. సంతోషిణి ఒకటి,రెండు తరగతులు బాడంగి టిఎల్ఎన్ పాఠశాలలోను, 3 నుంచి ఇంటర్ వరకు శ్రీచైతన్య పాఠశాల, కళాశాలలో చదివింది. టెన్త్ లో 10కి 10 పాయింట్స్ సాధించగా, ఇంటర్ లో 974 మార్కులు సాదించింది. తండ్రి అప్పారావు భోగాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేయగా తల్లి భవాని గృహిణి. కుమార్తెకు మంచి ర్యాంక్ రావడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం శ్రీచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థులు జరజాపు సందీప్ 228వ ర్యాంకు, డోర కీర్తన 2140 ర్యాంకు, గోక సంజన గాయత్రి 2154, నారంశెట్టి లాస్య 2535, పతివాడ సాయి సూర్య ప్రవల్లిక 3469, పొట్ల హర్షిత 4127, టి.శివాని 4648 ర్యాంకు సాధించారు. బొబ్బిలికి చెందిన పూడి జగదీశ్వరరావు కుమారుడు పూడి సంజయ్‌కుమార్ 4673వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి బిజెపి లీడర్ కాగా,తల్లి గృహిణి. జగదీశ్వరరావు సోదరుడు త్రివిక్రమ్ ఎపి ఎంసెట్‌లో 4225వ ర్యాంకు సాధించాడు.

అగ్రికల్చర్ ఫార్మసీలో సత్తాచాటిన విద్యార్థులు



టి.సింధురత్నం
64వ ర్యాంకు



కె.హర్షిత్
71వ ర్యాంకు

రాజాంకు చెందిన టి.సింధురత్నం 64వ ర్యాంకు , విజయనగరం పూల్ బాగ్‌కు చెందిన కె.హర్షిత్ 71, చీపురుపల్లికి చెందిన యు. నిఖితశ్రీ 90, అజ్జాడకు చెందిన కె.సాత్విక 101, విజయనగరానికి చెందిన ఎం.నీహారిక నాయుడు105, వై.హిరన్మయి (బొబ్బిలి) 127, విజయనగరం పాల్‌నగర్‌కు చెందిన కె.లోక్ నాథ్ అభిషేక్ 151, టి.అనిల్ కుమార్(గోకపేట) 152, జి.హాషిని (రాజాం) 182, జి.లిఖిత (రామభద్రపురం) 191వ ర్యాంకు సాధించారు.

ఇంజినీరింగ్‌లో ర్యాంకుల పంట



ఎన్.సిద్ధార్థ్
13వ ర్యాంకు



ఎం.ప్రణతిశ్రీజ
22వ ర్యాంకు



ఎల్.అనన్య
50వ ర్యాంకు



పి.మాధవ్
78వ ర్యాంకు



సాత్విక
196వ ర్యాంకు

ఇంజినీరింగ్ (ఇఎపిసెట్) పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో రామభద్ర పురానికి చెందిన నడిపిల్లి సిద్ధార్థ్ 13వ ర్యాంకు, గుర్ల గ్రామానికి చెందిన మీసాల ప్రణతి శ్రీజ 22వ ర్యాంకు, బొబ్బిలికి చెందిన ఎల్.అనన్య 50, గరివిడి మండలం వెదుళ్లవలనలకు చెందిన పి.మాధవ్ 78, విజయనగరంలోని జమ్ముకు చెందిన సైలాడ యశ్వంత్ 88, రాజుల గుమడకి చెందిన ఎస్.అవినాష్‌కుమార్ 91, బొబ్బిలి మండలం జగన్నాథపురానికి చెందిన పి.సాయి బాలాజీ అభిషేక్ 96, రాజాంకు చెందిన బి.ధనుష్ సాయి 97, బొబ్బిలికి చెందిన వి.వెంకట సాయి సూర్య ప్రకాష్134వ ర్యాంకు సాధించారు. విజయనగరం పూల్ బాగ్ కె.సాయి హర్షవర్ధన్ 152వ ర్యాంకు, దుప్పాడకు చెందిన పొట్నూరు సాత్విక 196వ ర్యాంకు, తోటపాలెంకు చెందిన పతివాడ సాత్విక్ 1572వ ర్యాంకు సాధించారు. శ్రీచైతన్య కళాశాలకు చెందిన సారికి భరత్‌కుమార్ 1210 ర్యాంకు, తాటికొండ వెంకటేష్ 1883, ఎ.మదన్‌చంద్ర కుమార్ 2630వ ర్యాంకులు సాధించారు.

దీపేష్‌కు 77వ ర్యాంకు



వి.దీపేష్
77వ ర్యాంకు

వీరఘట్టం : వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు బుధవారం విడుదలైన ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగంలో వి.దీపేష్ 77వ ర్యాంకు, వడ్డాది శ్రీ సూర్య గుణవంత్ 446వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో కొత్తవలస అరుణకుమారి 437వ ర్యాంకు సాధించింది.

చరిష్మాకు 441వ ర్యాంకు



జి.చరిష్మా
441వ ర్యాంకు

కురుపాం : ఇఎపిసెట్‌లో మొండెంఖల్ గ్రామానికి చెందిన గౌడు చరిష్మా 441వ ర్యాంకు సాధించింది. ఆమె పదో తరగతి వరకు పార్వతీపురం సురేష్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ విద్యను విశాఖలోని చైతన్య కళాశాలలో చదివింది.

ఇఎపిసెట్‌లో సత్తాచాటిన 'ఆర్‌కె'

ప్రజాశక్తి -పార్వతీపురం

ఎపి ఇఎపిసెట్‌లో ఆర్‌కె జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని డైరెక్టర్ పూడి రామకృష్ణ తెలిపారు. రెండేళ్లుగా విద్యార్థులు ఇంటర్‌తోపాటు ఇఎపిసెట్, నీట్‌లో సత్తాచాటుతున్నారని చెప్పారు. ఇఎపిసెట్‌లో ఎం.హితశ్రీ (బైపిసి) 2377 ర్యాంకు, ఎంపిసిలో గెంబలి సాయి భార్గవి 4167, భోగి సాయికృష్ణ 6970, రాగోలు పల్లవి 7707, గొర్లి అక్షయ (బైపిసి) 9899 ర్యాంకులు సాధించారు. వీరిని డైరెక్టర్ రామకృష్ణ అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ జూనియర్ కళాశాల డైరెక్టర్ రామకృష్ణ



ఇన్నాళ్లు సెల్‌ఫోన్ సేవలకు దూరంగా ఉన్న గిరిజనుల చింతలు తీరనున్నాయి. ఏడున్నర దశాబ్దాల నుంచి ఎటువంటి నెట్‌వర్క్ సౌకర్యమూ లేని మారుమూల గిరిజన గ్రామాలకు సెల్‌ఫోన్ సేవలు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర సమయాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక మైదాన ప్రాంతాలకు రావాల్సిన తిప్పలు ఇక నుంచి తప్పనున్నాయి. మారుమూల గ్రామాల్లో మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొబైల్ టవర్లను ప్రారంభించనున్నారు. దీంతో ఏజెన్సీలో సెల్‌ఫోన్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి రానున్నాయి.

మన్యంలోనూ ట్రింగ్ ట్రింగ్

- ఏజెన్సీలో విస్తృతంగా సెల్‌ఫోన్ సేవలు
- మారుమూల గ్రామాల్లో సెల్‌టవర్ల ఏర్పాటు
- నేడు మొబైల్ టవర్ల సేవలను ప్రారంభించనున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట



సెల్‌ఫోన్ సేవలు అందుబాటులోకి రావడంతో ఫోన్లను చూపిస్తున్న గిరిజనులు

జిల్లాలో 191 టవర్లను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఒఎఫ్), మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకాల కింద మంజూరు చేసింది. ఇందులో 73 టవర్ల నిర్మాణం బిఎస్ఎన్ఎల్ సంస్థ, 81 టవర్లను జియో, 36 టవర్లను ఎయిర్‌టెల్ సంస్థలకు కేటాయించారు. జియో పది ప్రదేశాల్లో.. గుమ్మలక్ష్మీపురం మండలం సికలబాయి, ఆమిటి., జియ్యమ్మవలస మండలం గొర్లి, కుంటంపాంద్రసింగి, కురుపాం మండలం పెల్లివలస, రంగుపురం, నగరకుంటుబాయి., పాచిపెంట మండలం కుంటంబడేవలస, తుమరవిల్లి, వేటగానివలసలో పనులు పూర్తి చేసి సిగ్నల్స్‌ను విడుదల చేసింది. ఎయిర్‌టెల్ గుమ్మలక్ష్మీపురం మండలం బీరుపాడు, దేరువాడ, గొయిపాక, మల్లుగూడ, కొమరాడ మండలం గునదతీలేసు, కురుపాం మండలం నేరేడువలస, ఊదరకొండ, పాచిపెంట మండలం కుంటం, సాలూరు మండలం సారిక గ్రామాల్లో నిర్మించిన టవర్ల నుండి సిగ్నల్స్ విడుదల చేసింది. మొత్తం 191 టవర్లలో కొమరాడ మండలంలో 23, గుమ్మలక్ష్మీపురం మండలంలో 56, పాచిపెంట మండలంలో 20, కురుపాం మండలంలో 33, సాలూరు మండలంలో 19, సీతంపేట మండలంలో 27, జియ్యమ్మవలస మండలంలో 7, మక్కువ మండలంలో 4, పార్వతీపురం మండలంలో ఒకటి, భామిని మండలంలో ఒకటి ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో మొబైల్ టవర్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టింది. స్థలాలను వెనువెంటనే అప్పగించడంలో, వివిధ అనుమతులు మంజూరులో త్వరితగతిన చర్యలు చేపట్టింది. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ అనుమతులు సైతం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన గల జిల్లా కమిటీ వేగంగా జారీ చేసింది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసి సిగ్నల్ విడుదల చేసిన ప్రాంతాల్లో ప్రజలు హర్షాతిరేకతలు వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ విప్లవం జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. తమ బంధువులు, స్నేహితులతో ఫోన్‌లో సంభాషిస్తూ ఆనందం పంచుకుంటున్నారు.

అత్యవసర సమయంలో ఫోన్ ద్వారా సమాచారం అందించి సేవలు పొందే అవకాశం కలిగింది. ఒకప్పుడు అత్యవసర సమయంలో ముఖ్యంగా ప్రసవాలు, అతిసార వంటి సమయాల్లో ఇతర మార్గాలలో సేవలు పొందుటకు ప్రయత్నించి సమస్యల నుండి గట్టెక్కించారు. మొబైల్ టవర్ల ఏర్పాటు వల్ల క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సేవలు మరింతగా అందుబాటులోకి రానున్నాయి. టెలీ మెడిసిన్ వంటి సేవలు ప్రవేశ పెట్టవచ్చని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆలోచన. తద్వారా మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఆధునిక వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో కృతకృత్యులు కాగలమని నమ్మకం. డిజిటల్ విప్లవంతో మన్యం మరింత సౌభాగ్యం కావాలని జిల్లా కలెక్టర్ యోచిస్తున్నారు.

వర్చువల్‌గా ప్రారంభం

పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్మాణం పూర్తయిన మొబైల్ టవర్లను ముఖ్యమంత్రి జగన్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించను న్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేసింది. గుమ్మలక్ష్మీ పురం మండలం సికలబాయి, పాచిపెంట మండలం కుంటంబడే వలసలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వర్చువల్‌గా గురువారం సెల్ టవర్ల ప్రారంభిస్తున్న నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని శిఖలబాయిలో నూతనంగా నిర్మించిన జియో టవర్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రారంభానికి సంబంధించి పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలిం చారు. సెల్ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి హాజరుకానున్నారు.



సెల్ టవర్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సిఎం పర్యటనకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల చివరి వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కురుపాంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక సాయిరాం ఆలయ సమీపంలోని మైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు హేమలత, నూరుల్ కమర్, డిఎస్‌పి జి.వి.కృష్ణారావు, తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం మహాసభ వాయిదా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 16, 17వ తేదీల్లో జరగాల్సిన ఎపి గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభను వాయిదా వేసినట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర నాయకులు కోలక అవినాష్ తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని, జులై 14, 15 తేదీల్లో కురుపాంలో మహాసభ జరుగుతుందని చెప్పారు. ఈ విషయాన్ని గిరిజన ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు గమనించాలని కోరారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.జీవన్‌జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. జులై మూడో తేదిన సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. 4న క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఎస్‌సి హాస్టల్లో ప్రవేశాలకు..

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని చిన్నమేరంగి ఎస్‌సి వసతిగృహంలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ఎం.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 67 సీట్లు ఖాళీగా ఉన్నాయని, నాలుగు నుంచి పదో తరగతి వరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి విద్యార్థులు చేరవచ్చని తెలిపారు.

ఐటిడిఎ పిఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలో ఐటిడిఎ పిఒ కల్పన కుమారి బుధవారం విస్తృతంగా పర్యటించారు. బడ్డుమాసంగి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లకు నీరు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులు ఎంతమంది వచ్చినా సరే తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం ఎం.సింగుపురం పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణపై డిప్యూటీ డిఎంహెచ్ఒ విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు. స్టాఫ్‌నర్స్ జయలక్ష్మి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వైద్యానికి సంబంధించి సమాచారం పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఆమెకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం డోలమడవలస గ్రామంలో మలేరియా పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గొట్టమంగలాపురం గ్రామంలో హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభం కాని గృహాలను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ హౌసింగ్ ఎఇ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ జగన్నాథరావు



సదస్సులో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జగన్నాథరావు మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఎదుగుదల, ఆరోగ్య సమస్యలపై మాత్రమే పరీక్షలు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం నేరమన్నారు. ఆడ, మగ అని అడిగినవారు, ప్రోత్సహించిన వారు, చెప్పిన వైద్యులు శిక్షార్హులని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై 104 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని, పిసిపిఎన్‌డిటి ఆన్‌లైన్ ద్వారా గాని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆడ పిల్లల నిష్పత్తి తగ్గకుండా వార్డు , గ్రామ కమిటీ సమావేశాల్లోనూ, హైస్కూల్, కాలేజీలు, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కార్యక్రమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆడ, మగ తేడా లేకుండా సమానంగా చూడాలని, సమానంగా చదివించాలని సూచనలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు స్కానింగ్ కేంద్రాల తనిఖీలు చేపట్టి, నిఘా పెడతామన్నారు. కమిషనర్ జె.రామఅప్పలనాయుడు మాట్లాడుతూ ఆడపిల్లల అక్షరాస్యత శాతం పెంచాలని, తద్వారా వారి జీవన ప్రమాణం మరింత మెరుగు పడుతుందని అన్నారు. ఆడపిల్లను రక్షించండి – ఆడ పిల్లను చదివించండి నినాదాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్ళాలని కోరారు.

నోడల్ అధికారి, డిఐఒ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఎక్కడైనా గర్భస్రావం జరిగినట్లు గుర్తిస్తే అందుకు గల కారణాలపై సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ఆడ, మగ లింగ నిష్పత్తి సమానంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దక్షయ్, డాక్టర్ కుమార్, డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ రేంజర్ రామారావు

గుమడాం పరిసరాల్లోనే

పులి సంచారం

అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-సాలూరు

కొద్దిరోజుల క్రితం గుమడాం సమీపంలో ఉన్న తోటలో అవుపై దాడి చేసి చంపేసిన పెద్దపులి అదే ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. బాగువలస దారిలో ఉన్న పామాయిల్ తోట యజమాని రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు అటవీ రేంజ్ అధికారి కె.రామారావు ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. పామాయిల్ తోటలోకి మళ్లీ పులి వచ్చిందనే అనుమానాలు యజమాని రాంప్రసాద్ వ్యక్తం చేయడంతో అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. దీని కోసం యానిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ ప్రతినిధి అమర్‌నాథ్‌ని రప్పించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సూచన మేరకు ఆవులకు వెనుక భాగంలో మార్కింగ్‌లు వేసి చూపించారు. ఆ మార్కింగ్‌ని పులి చూసి ఆవు దగ్గరకు రాదని ఆయన చెప్పారు. రాత్రి వేళల్లో బయటకు వెళ్లరాదని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పామాయిల్ తోటలో పని చేస్తున్న కూలీలు, సమీపంలో ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పది, ఇంటర్ విద్యార్థులకు నేడు బహుమతులు

ప్రజాశక్తి-సాలూరు

ఈ ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల స్థాయిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో చెప్పారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన విద్యార్థులకు సంబంధించిన ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని డబ్బీవీధి మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సైనిక దళాల రిక్రూట్‌మెంట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వచ్చే జూలై 20 నుంచి రిక్రూట్ మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన యువత కోసం ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దీనిని రెండు జిల్లాలకు చెందిన యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. భారతీయ నౌకాదళం, వాయుసేన, సైనిక దళాల్లో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల ఎంపిక కోసం జరిగే శారీరక, రాతపరీక్షల్లో రెండు జిల్లాల యువత అధికంగా అవకాశాలు పొందేందుకు వీలుగా నిపుణులైన కోచ్‌లు, రిటైర్డ్ ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిక్షణ శిబిరాన్ని వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన 17 -23 సంవత్సరాల యువత ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే ఆసక్తి ఉంటే జిల్లా కేంద్రంలో ఇస్తున్న శిక్షణలో చేరాలన్నారు. నలభై రోజుల పాటు శారీరక దారుఢ్యంలో, రాతపరీక్షలో అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని, రిక్రూట్‌మెంట్ జరిగే రోజు వరకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. జూన్ 20 నుంచి ఇక్కడ పూర్తిస్థాయి శిక్షణ ఇక్కడ ప్రారంభమవుతుందని, ఈలోగా రెండు జిల్లాల అభ్యర్థులు శిక్షణ శిబిరంలో చేరేందుకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో జూలై 20 నుంచి ఆగష్టు 2వ తేదీ వరకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహణకు రూ.5 లక్షలు, జిల్లా యంత్రాంగం నుంచి మరో రూ.3 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన యువతీ యువకులు ఈ ర్యాలీకి హాజరు కానున్నారని, పోలీసు శిక్షణ కేంద్రంలో ఈ ర్యాలీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ చెప్పారు. శిక్షణ శిబిరంలో పేర్లు నమోదు చేసుకోదలచిన అభ్యర్థులు సెట్విజ్ సిఇఒ మొబైల్ నెంబరు 9849909080 కు ఫోన్ చేసి శిబిరంలో చేరవచ్చని తెలిపారు. రాజీవ్ స్టేడియంలోని తమ కార్యాలయంలో కూడా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కష్ణారావు, పోలీసు శిక్షణ కేంద్రం అధికారి మురళి తదితరులు కూడా పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 8 నుండి 11వ తేదీ వరకు డెహ్రాడూన్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన 38వ సీనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన గగన్ సాగర్ సిల్వర్ మెడల్, వై.భార్గవి బ్రాంజ్ మెడల కైవసం చేసుకున్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా సీనియర్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో మెడల్ సాధించినవారు వీరిద్దరే. ఈ సందర్భంగా వీరిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు సిహెచ్ వేణుగోపాలరావు, ట్రెజరర్ అవునాపు విక్రమ్, ఉష అసోసియేషన్ అధ్యక్షులు జి శ్రీనివాసు, సెపక్తక్రా అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ అభినందించారు.

నేడు మెప్మా అర్బన్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలోని డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, వస్తువుల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ ప్రారంభిస్తారు. పట్టణంలోని లక్ష్మీ థియేటర్ ఆవరణలో మెప్మా అర్బన్ బజార్‌ని ప్రారంభించనున్నట్లు సిఎంఎం ఎం.పుష్ప ఒక ప్రకటనలో తెలిపారు.

జగనన్న కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని మాతుమూరు ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ బి.దనంజయ్, మాజీ సర్పంచ్ బి.సత్యవతి చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్ల ను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం జె.పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు ఉన్నారు.

బొమ్మలతో ప్రీస్కూల్ పిల్లలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ప్రీస్కూల్ పిల్లలకు చార్టులు, బొమ్మల ద్వారా అవగాహన కల్పించడమే జనభాగీదారి కార్యక్రమం ఉద్దేశమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వివి రమణమ్మ తెలిపారు. బుధవారం మండలంలో కురుపాం, గుమ్మ, కాకిలి సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు జనభాగీ దారి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.విజయగౌరి, శ్రావణి, అంగన్వాడీ కార్యకర్త జె.సరోజ, మహిళా పోలీసులు రోజారాణి, పైడిరాజు పాల్గొన్నారు.

గోపాలరావుకు పరామర్శ

ప్రజాశక్తి-సీతంపేట

సోమగండి మాజీ సర్పంచ్ సవర గోపాలరావును బుధవారం టిడిపి నాయకులు పడాల భూదేవి పరామర్శించారు. గోపాల్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న భూదేవి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గిరిజనులు కిడ్నీ, కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతుండటం పట్ల ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో విఎఎ జ్యోతి పాల్గొన్నారు.

పుణ్యగిరి అభివృద్ధికి తీర్మానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యగిరి క్షేత్రం అభివృద్ధికి పాలకమండలి ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేసినట్లు పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ పలమర శెట్టి రామకృష్ణ తెలిపారు. పుణ్యగిరిలో ఉన్న కార్యాలయంలో పాలకమండలి చైర్మన్ పలమరశెట్టి రామకృష్ణ, ఈవో నాగేంద్ర ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహిం చారు. చైర్మన్ మాట్లాడుతూ పుణ్యగిరి పర్యాటక ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ పరిధిలో కొత్త హుండీలు ఏర్పాటు, క్యూలైన్లకు పోల్స్ ఏర్పాట్లు, పుణ్యగిరి రోడ్డు మరమ్మ తులు గురించి చర్చించామన్నారు. అర్చకుల పూజా విధానంపై కూడా భక్తులు చేస్తున్న సూచనలు సలహాలు పైన చర్చించారు. దీనికి సంబంధించి తీసుకోవాల్సిన విషయాలపై పాలకమండలి సభ్యులు పలు సూచనలు సలహాలు అందించారన్నారు. ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో పాలకమండలి సభ్యులు హాజరు లేకపోవడంతో మరోసారి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేద్దామని తీర్మానం చేశామ న్నారు. సమావేశంలో పాలకమండలి సభ్యుడు గార్లపాటి సత్యసాయి, నాగరాజు, దార గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు రాజగోపాల్, సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం అధ్యక్షులుగా శారద

ప్రజాశక్తి-బొబ్బిలి

మానవ హక్కుల సంఘం మహిళా విభాగం సౌత్ ఇండియా అధ్యక్షులుగా అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ చింతా శారద ఎన్నికయ్యారు. ఆమె ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. రాష్ట్ర అధ్యక్షులు నుంచి సౌత్ ఇండియా అధ్యక్షులుగా ఎంపిక చేస్తూ జాతీయ అధ్యక్షులు ఎంఆర్ అన్సారీ నియామక పత్రాన్ని బుధవారం జారీ చేశారు. మానవ హక్కులు పరిరక్షణకు పని చేస్తామని చింతా శారద ఈ సందర్భంగా అన్నారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మెరక ముడిదాం

మండలంలోని బైరిపురం గ్రామానికి చెందిన సబ్బిశెట్టి శ్రీరాములు (89) బుధవారం విజయనగరం వెళ్తుండగా వడ దెబ్బకు మార్గం మధ్యలో మృతి చెందారు. మృతుని కుమారుడు గరివిడిలో నివాసం ఉంటున్నారు. శ్రీ రాములు భార్య వెంకటమ్మ ఈ మధ్యనే చనిపోయింది. శ్రీరాములు ఒక్కరే బైరిపురం గ్రామంలో వుంటున్నారు. తన బంధువులు ఇంటికి విజయనగరం వెళ్తుండగా వడ దెబ్బకు మృతి చెందినట్లు తెలిస్తోంది.

హడావుడి చేసి వదిలేశారు!

గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటు ఎప్పుడు?

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటు చేస్తామని హడావుడి చేసిన ఐటిడిఎ అధికారులు నేటికీ ప్రారంభించలేదు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ కళాశాలలో 2021-22 విద్యా సంవత్సరంలో తాత్కాలికంగా డైట్ కళాశాల మౌలిక సదుపాయాల కోసం విడుదల చేసిన రూ.35 లక్షలు వెనక్కి వెళ్లాయి. దీంతో కళాశాల ఏర్పాటు కోసం వచ్చిన నిధులు లేకుండా పోయాయి. స్థానికంగా డైట్ శిక్షణ లేకపోవడంతో గిరిజన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అప్పటి పార్వతీపురం ఐటిడిఎ అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్ల నేటికీ గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ప్రారంభానికి నోచుకోలేదు.



డైట్ కళాశాల ఏర్పాటు చేయాలని పిఒను కోరుతున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

డైట్ కళాశాలపై పిఒకు వినతి

కలెక్టరేట్ : కురుపాం మండలం ఎగువ కొత్తగూడ రోడ్డు పనులు పూర్తి చేయాలని, గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘ నాయకులు పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను బుధవారం కలిసి వినతి అందించారు. పిఒ స్పందిస్తూ వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాలకు సంబంధించి వివరాలు, పరిస్థితి తెలుసుకుని చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, గిరిజన నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కద్రక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు రెన్యువల్‌లో

అభ్యంతరకర అంశాలు తొలగించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల కాంట్రాక్టు రెన్యువల్‌లో అభ్యంతరకర అంశాలను తొలగించాలని ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మండంగి హరనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పార్వతీపురం ఎంపిడిఒ ఎన్.కృష్ణుడుకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీసం వేతనం రూ26 వేలు ఇవ్వాలని, యాప్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కరించి, ఎఫ్‌ఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 17 ఏళ్ల సర్వీసు నిండిన వారిని గుర్తించి సర్వీసు క్రమబద్ధీకరించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ఎఫ్‌ఎలకు ఎక్స్‌గ్రేషియా రూ.15 లక్షలు మంజూరుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శంకరరావు, గులిపిల్లి రామారావు, తులసి, లాడి దుర్గారావు, రమణమ్మ, అశోక్, వి.నాగరాజు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ఫీల్డ్ అసిస్టెంట్లు కాంట్రాక్టు రెన్యువల్ కాపీలో అభ్యంతర విషయాలపై బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రెన్యువల్ పత్రాల్లో పది అభ్యంతరకర విషయాలను చేర్చారని తెలిపారు. పదో తరగతి చదువుకున్న తమకు ఇంగ్లీషులో పత్రాలను పంపించడం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒకు వినతి అందించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎన్‌జిఒహోంలో ఎపి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాతలను ఆయన అభినందించారు. ప్రశంసా పత్రాలను అందజేశారు.

జియమ్మవలస : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెదమేరంగి గ్రామంలో వైఎస్‌ఆర్ క్లినిక్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రక్తాన్ని దానం చేసి మరొకరి ప్రాణాన్ని జీవితాన్ని నిలబెట్టాలని కోరారు.



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

దిశ యాప్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో బుధవారం వారపు సంతలో దిశ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారపు సంతకు వచ్చిన విద్యార్థులు, మహిళలతో సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్లోడ్ చేయించారు. ఏ విధంగా వినియోగించాలనే దానిపై నేర్పించారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ ఒక రక్షణ కవచం వంటిదని మహిళా పోలీస్ లక్ష్మి అన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరితో మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్లోడ్ చేయించాలని సూచించారు.

జియ్యమ్మ వలస : దిశ యాప్ గురించి చిన్న మేరంగి ఎస్ఐ జి.కళాధర్ బుధవారం చింతల బెలగాం రహదారి వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. దిశ యాప్ ప్రతిఒక్కరి చరవాణిలో ఉండాలని, ఆపద సమయంలో ఉపయోగించి పోలీసులు సహకారం పొందాలని ఆయన కోరారు. ఆపదలో ఉన్న ఎంతోమందిని దిశ యాప్ ద్వారా పోలీసులు రక్షించారని తెలిపారు. ప్రధానంగా మహిళలు తమ చరవాణిలో యాప్ ఉంచుకోవాలని ఆయన సూచించారు. సెల్‌ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరితో దిశ యాప్‌ను ఎస్ఐ డౌన్లోడ్ చేయించారు.

గరుగుబిల్లి : మండలంలోని ఎర్రగుడి జంక్షన్ వద్ద ఎఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాహనదారులకు, ప్రయాణికులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు గౌతమి, డి.శ్రీజ, హేమలత, తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస.. దిశ యాప్‌ను ప్రయాణికుల సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి, చూపిస్తున్న ఎస్ఐ, మహిళా పోలీసులు

గిరిజనులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాలవలస పంచాయతీ గొందిలోవ గ్రామంలో 40 మంది గిరిజనులకు పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం వారి గ్రామానికి వెళ్లి వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చీరలు, తువ్వాళ్లు, లుంగీలు, స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వచ్చిన జీతంలో ఎంతో కొంత పేదలకు సాయం చేయడంతో తృప్తిగా ఉంటుందని తెలిపారు. నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటానన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు రాగాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బిడ్డిక వెంకటరావు, బిడ్డిక రమేష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

క్రికెట్ టోర్నీ విజేత అఖిల్ జట్టు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో నవోదయ యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అఖిల్ ఎలెవెన్ టీం నిలిచింది. బుధవారం సాయంత్రం విజేత జట్టుకు మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్ ట్రోఫీ, 25 వేల నగదు బహుమతి అందజేశారు. రన్నర్ చత్రపతి శివాజీ జట్టుకు 15 వేల రూపాయల నగదు బహుమతిని ప్రజావైద్యశాల వైద్యులు పెంట శ్రీనివాసరావు, నవోదయ సేవా సమితి నిర్వాహకులు జి.రామ్ గోపాల్ అందజేశారు.

అందుబాటులో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు

ప్రజాశక్తి-సీతానగరం

పిహెచ్‌సితోపాటు వెల్‌నెస్ కేంద్రాల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్లను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారి పి.ఉషారాణి తెలిపారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డయేరియా లక్షణాలు ఉన్న పిల్లలను గుర్తించి ఒఆర్‌ఎస్, జింక్ మాత్రలు నిర్దేశించిన మోతాదులో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, సత్యవతి, సింహాచలం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సిడిసి సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఎన్‌సిడిసి సర్వే చేపట్టాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం కుసిమి, మర్రిపాడు, దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైకెపి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల్లో సర్వే చేపట్టాలన్నారు. రోగులు ఇకెవైసి, ఆధార్ అప్‌డేట్ చేయకపోతే వాలంటీర్లు, ఆశావర్కర్లు తప్పనిసరిగా చేయించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు భాను ప్రతాప్, రవీంద్ర కుమార్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానభారతి పాఠశాలకు రూ.20 లక్షలు విరాళం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలకు మూడు తరగతి గదుల నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన వైజాగ్ వాకింగ్ కింగ్ రౌండ్ టేబుల్ ఇండియా -77.. రూ.20 లక్షల విరాళం అందజేసింది. బుధవారం కరస్పాండెంట్ పాండురంగకు ఆ మొత్తాన్ని అందజేశారు. దీంతో భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సందీప్ రెడ్డి, ప్రతికి సింగ్, అవినాష్ మెట్టపల్లి, డివిఎ రమణమూర్తి, సీతమ్మ రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యువతకు ఆదర్శం చేగువేరా

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రశ్నించేతత్వం, పోరాడే గుణం నేర్పిన చేగువేరా యువతకు ఆదర్శమని డివైఎఫ్ఐ పూర్వ నాయకులు కె.రామస్వామి తెలిపారు. బుధవారం పార్వతీపురం సుందరయ్య భవనంలో చేగువేరా 95వ జయంతి సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ వృత్తి నుండి సమసమాజ స్థాపనకు చేగువేరా అంకితమయ్యారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, డివైఎఫ్ఐ నాయకులు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.గంగునాయుడు, పి.రాము, పోలి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జెవికె కిట్ల పంపిణీ వేగవంతం

ప్రజాశక్తి-సీతంపేట

జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పాఠశాలకూ సరఫరా చేయలేదని ఫిర్యాదు రాకూడదని సిబ్బందిని ఆదేశించారు. విద్యా ప్రమాణాలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

భామిని : రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని డిఇఒ ప్రేమ్‌కుమార్.. ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బత్తిలి, భామిని హైస్కూళ్లు, కెజిబివి, భామిని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలని చెప్పారు. జెవికె కిట్లు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. బడ్జెట్ ఉన్నంత మేరకు నాడు - నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలు పాఠశాలకు వచ్చేలా వాతావరణం కల్పించి, వారిని చేర్పించాలని సూచించారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్ కుమార్

దబ్బగడ్డలో ఫౌండేషన్ స్కూల్

ప్రజాశక్తి-మక్కువ

గత కొన్నేళ్లుగా దబ్బగడ్డ పంచాయతీ కేంద్రంలో పాఠశాల లేక ఇబ్బందులు పడుతున్న పిల్లలకు ఊరట లభించింది. జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు కృషితో ఎట్టకేలకు ఫౌండేషన్ పాఠశాల మంజూరైంది. బుధవారం స్థానిక ఎంపిపి మర్రి పారమ్మ పాఠశాలను ప్రస్తుతం అద్దె భవనంలో ప్రారంభించారు. ఒకటి రెండు తరగతులకు బోధన చేపడతారని ఎంఇఒ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంఇఒ, తదితరులు

నేరాలు ఘోరాలు

బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కొమరాడ గ్రామానికి చెందిన ఏగోటి కృష్ణ బుధవారం గుమడ నుండి కొమరాడకు కాలినడకన వస్తుండగా గుమడ రైల్వే స్టేషన్ కూడలిలో బైక్‌తో వస్తున్న వ్యక్తులు ఢీకొన్నారు. దీంతో కృష్ణతోపాటు బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు స్పందించి వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం రాజుగారికోట ప్రాంతానికి చెందిన గుడ్ల శ్రావణికి అదే గ్రామానికి చెందిన ఊళ్ల రవితేజతో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న భర్తతో కాపురానికి వెళ్లింది. తన భర్తతోపాటు ఫోన్‌లో అత్తమామలు కట్నం కోసం వేధిస్తున్నారని శ్రావణి పోలీసులకు ఫిర్యాదుచేసింది. రెండు రోజులు క్రితం హైదరాబాద్‌లో భర్త తీవ్రంగా కొట్టడంతో ఆత్మహత్యకు ప్రయత్నించగా, ఇంటి యజమాని సముదాయించి, తనని పార్వతీపురంలోని కన్నవారింటికి పంపించారని తెలిపింది. భర్త, అత్త, మామలపై చర్యలు తీసుకోవాలని కోరింది.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సీతానగరం మండలం తామరఖండి గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సత్యనారాయణ తాగుడుకు బానిసై కుటుంబ బాధ్యతలు నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతని భార్య రూపి బుధవారం తాగుడు మానుకోవాలని, లేకుంటే ఇంటికి రానివ్వనని మందలించింది. దీంతో సత్యనారాయణ ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.